www.kandilinews.com

# కందిలి

న్యూస్.. దారిచూపే దీప శిఖ

ఆదివారం | 31.05.2026 సంపుటి: 01 | సంచిక: 262 | వెల: రూ. 4 /- TGTEL/25/A 1800



మీ ప్రాంతంలోని సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదా? అధికారుల చుట్టూ ఎన్ని సార్లు తిరిగినా ప్రయోజనం కనిపించడం లేదా? ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారా?.. ఇలాంటి సమస్యలు ఏవైనా సరే.. 'కందిలి' దృష్టికి తీసుకురండి.

**70365 45130**

నంబరుకు వాట్సాప్ చేసి వివరాలు అందించండి. అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా కథనాలు అందించి, సమస్యల పరిష్కారానికి మా బాధ్యతగా కృషి చేస్తాం.

ఇట్లు.. టీం కందిలి



# ఉపాధినిచ్చే చోటు... మరుభూమిగా మారిన రోజు!

3 లో


అది సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గంలోని పాశమైలారం పారిశ్రామిక ప్రాంతం. ఉదయం సమయం. షిఫ్టు ముగిసిన కార్మికులు ఇళ్లకు వెళ్లిపోతుండగా, తమ షిఫ్టు సమయం కావడంతో ఆదరబాదరాగా మరికొందరు కార్మికులు కంపెనీల గేట్లు దాటి, లోపలికి వెళ్లేందుకు వడివడిగా అడుగులేస్తున్నారు. వాహనాల రాకపోకలతో ఆ ప్రాంతమంతా సందడిగా ఉంది.




## మీనాక్షి నటరాజన్ భేటీపై.. అనవసర రాజకీయ అర్థాలు తియ్యొద్దు!

- ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లవుతున్న సందర్భంగా.. పార్టీని బలోపేతం చేయాలనే అంశమై చర్చించాం
- గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నాయకులు, కార్యకర్తలు ఒక టీంగా సమన్వయంతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని సూచించాను
- రాబోయే 6 నెలల నుంచి ఏడాది కాలం అత్యంత కీలకమని వివరించాను
- ఎవరిపైనా వ్యక్తిగతంగా ఫిర్యాదు చేయలేదు.. ఎవరి పేర్లూ ఇన్చార్జి వద్ద ప్రస్తావించలేదు
- మీనాక్షి నటరాజన్ తో భేటిపై క్లారిటీ ఇచ్చిన జగ్గారెడ్డి

4 లో




2 లో

## మహాముదురు... ఈ జిల్లా వైద్యాధికారి!

ఆయన ఒక జిల్లా స్థాయి అధికారి. కానీ మృతుడి కుటుంబీకులకు ఇవ్వాల్సిన డబ్బులను తన సొంత అవసరాల కోసం వాడేసుకున్నారు. బాధిత కుటుంబసభ్యులు, బంధువులను దాదాపు ఆరునెలలుగా తన చుట్టూ తిప్పించుకున్నారు. మధ్యలో ఒకసారి చెల్లని చెక్కు ఇచ్చారు. తీరా ఆయన ట్రాన్స్ ఫర్ కావడంతో విషయం తెలిసి కుటుంబసభ్యులు కుటుంబసభ్యులు కార్యాలయానికి వచ్చి కూర్చున్నారు. దీంతో ఇన్నాళ్లూ గుట్టుగా ఉన్న వ్యవహారం కాస్తా బహిర్గతమైంది. ఈ అంశమై 'కందిలి' అందిస్తున్న కథనమిది.



డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద వసంతరావుతో వాగ్వాదానికి దిగిన వెంకటేష్ గౌడ్ బంధువులు

# మహాముదురు...ఈ జిల్లా వైద్యాధికారి!

- మృతుడి కుటుంబానికి ఇవ్వాల్సిన డబ్బులు.. వాడేసుకున్న డీఎంహెచ్ఓ వసంతరావు
- రూ.10లక్షలు ఇస్తానని ఈ ఏడాది ఏప్రిల్ నెలలో చెక్కు రాసిచ్చిన డీఎంహెచ్ఓ
- తీరా బ్యాంకుకు వెళితే ఖాతాలో డబ్బులు లేవని చెప్పిన బ్యాంకు ఉద్యోగులు
- డబ్బులు ఇవ్వాలని అడిగిన కుటుంబసభ్యులను ఆరునెలలుగా తిప్పించుకున్న వైనం
- డీఎంహెచ్ఓ వసంతరావు ట్రాన్స్ ఫర్ అయ్యారని తెలిసి శనివారం కార్యాలయానికి వచ్చిన మృతుడి కుటుంబీకులు
- డబ్బులు ఇవ్వాల్సిందేనని అడగడంతో సోమవారం వరకు ఇస్తానని మరోసారి మభ్యపెట్టే యత్నం
- అదేం కుదరదని భీష్మించుకొని కూర్చోవడంతో.. తప్పనిసరై రూ.5లక్షలు డ్రా చేసిన ఇచ్చిన పరిస్థితి
- మరో రూ.5లక్షలు పదిరోజుల్లోగా చెల్లిస్తానని హామీ

**కందిలి, సంగారెడ్డి**

ఆయన ఒక జిల్లా స్థాయి అధికారి. కానీ మృతుడి కుటుంబీకులకు ఇవ్వాల్సిన డబ్బులను తన సొంత అవసరాల కోసం వాడేసుకున్నారు. బాధిత కుటుంబసభ్యులు, బంధువులను దాదాపు ఆరునెలలుగా తన చుట్టూ తిప్పించుకున్నారు. మధ్యలో ఒకసారి చెల్లని చెక్కు ఇచ్చారు. తీరా ఆయన ట్రాన్స్ ఫర్ కావడంతో విషయం తెలిసి కుటుంబసభ్యులు కుటుంబసభ్యులు కార్యాలయానికి వచ్చి కూర్చున్నారు. దీంతో ఇన్నాళ్లూ గుట్టుగా ఉన్న వ్యవహారం కాస్తా బహిర్గతమైంది. ఈ అంశమై 'కందిలి' అందిస్తున్న కథనమిది.

**నవంబరు 18న..**
**వెంకటేష్ గౌడ్ మృతి!**

సంగారెడ్డి పట్టణం విద్యానగర్ కు చెందిన వెంకటేష్ గౌడ్ అనే వ్యక్తి అనారోగ్యం పాలై సంగారెడ్డిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని బంధువులు ఆరోపించారు. తీరా ఈ విషయం రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి వద్దకు చేరింది. ఆయన సూచన మేరకు డీఎంహెచ్ఓ వసంతరావు మధ్యవర్తిగా న నిలిచారు. రూ.25లక్షల పరిహారం ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది.

**తొలుత రూ.15లక్షలు..**
**ఆపై రూ.5లక్షల చెక్!**

ఆస్పత్రి యాజమాన్యం తొలుత మృతుడి కుటుంబీకులకు రూ.15లక్షల నగదు అందించింది.


జిల్లా వైద్యాధికారిగా పనిచేసిన వసంతరావు

డిసెంబరు నెలలో రూ.5లక్షల చెక్ డీఎంహెచ్ఓ వసంతరావుకు అందించారు. మృతుడి కుటుంబీకులకు ఇవ్వాలని తెలిపారు. కానీ అదే నెలలో వసంతరావు చెక్కును తన మిత్రుడి ఖాతాలో వేసి, డబ్బులు డ్రా చేసుకున్నారు. ఈ విషయం ఆస్పత్రి యాజమాన్యానికి, మృతుడి బంధువులకూ తెలియలేదు.

**ఎప్పుడు అడిగినా..**
**రూ.10లక్షలు ఇస్తానంటూ!**

ఈ క్రమంలో మృతుడి కుటుంబీకులు చాలా సార్లు తమకు ఇంకా రావాల్సిన రూ.10లక్షలు ఎప్పుడు ఇస్తారంటూ డీఎంహెచ్ఓ వసంతరావును అడిగారు. ఆయన ఇస్తానంటూనే.. జాప్యం చేస్తూ వచ్చారు. మార్చినెలలో రూ.10లక్షల చెక్ రాసిచ్చారు. తీరా బ్యాంకుకు వెళితే, ఆ ఖాతాలో డబ్బులు లేవని తెలిసింది. చివరకు ఈ ఏడాది ఏప్రిల్ నెలలో తానే రూ.10లక్షలు ఇస్తానంటూ ఒక పేపరుపై వసంతరావు రాసిచ్చారు. అప్పటి నుంచి తమకు డబ్బులు ఇవ్వాలంటూ మృతుడి కుటుంబీకులు డీఎంహెచ్ఓ వసంతరావు చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

**ట్రాన్స్ ఫర్ అయ్యారని తెలిసి...!**


తాజాగా డీఎంహెచ్ఓ వసంతరావు ట్రాన్స్ ఫర్ అయ్యారు. ఈ విషయం తెలుసుకున్న వెంకటేష్ గౌడ్ కుటుంబసభ్యులు, బంధువులు శనివారం సంగారెడ్డిలోని డీఎంహెచ్ఓ కార్యాలయానికి వెళ్లారు. అప్పుడు కూడా డబ్బులు సోమవారంలోగా ఇస్తానని వసంతరావు వారిని మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. కానీ డబ్బులు ఇచ్చే వరకు ఎక్కడికి వెళ్లనివ్వబోమని వారు భీష్మించుకొని కూర్చుకున్నారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో రూ.5లక్షలు డ్రా చేసి వారికి వచ్చారు.

**మరో రూ.5లక్షలు..**
**పదిరోజుల్లో ఇస్తానంటూ!**

ఇదే విషయమై వసంతరావును వివరణ కోరగా.. 'ఆస్పత్రి వాళ్లు రూ.5లక్షల చెక్ మాత్రమే ఇచ్చారు. మా మిత్రుడి ఖాతాలో ఆ డబ్బులు వేశాను. ఆ డబ్బులకు మరో రూ.5లక్షలు నా సొంత డబ్బులు కలిపి ఇస్తున్నా''ను అంటూ సమాధానమిచ్చారు. చివరకు మరో రూ.5లక్షలు పదిరోజుల్లో ఇస్తానని వెంకటేష్ గౌడ్ బంధువులకు హామీ ఇవ్వడం విశేషం.


మార్చి 5, 2026 తేదీతో రూ.10లక్షలకు వసంతరావు ఇచ్చిన చెక్




తానే రూ.10లక్షలు ఇస్తానంటూ ఏప్రిల్ 17న డీఎంహెచ్ఓ వసంతరావు రాసిచ్చిన లేఖ



# ఉపాధినిచ్చే చోటు...

# మరుభూమిగా మారిన రోజు!

**జూన్ 30, 2025**

అది సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గంలోని పాశమైలారం పారిశ్రామిక ప్రాంతం. ఉదయం సమయం. షిఫ్టు ముగిసిన కార్మికులు ఇళ్లకు వెళ్లిపోతుండగా, తమ షిఫ్టు సమయం కావడంతో ఆదరబాదరాగా మరికొందరు కార్మికులు కంపెనీల గేట్లు దాటి, లోపలికి వెళ్లేందుకు వడివడిగా అడుగులేస్తున్నారు. వాహనాల రాకపోకలతో ఆ ప్రాంతమంతా సందడిగా ఉంది. సిగాచీ పరిశ్రమలోనూ దాదాపుగా ఇదే పరిస్థితి. ఉదయం షిఫ్టుకు వచ్చిన కార్మికులు, ఉద్యోగుల తమ పనుల్లో నిమగ్నమయ్యారు. కొంత ఆలస్యంగా వస్తున్న వారూ గేట్ వద్ద ఫోన్లు అప్పగించి, రికార్డుల్లో సంతకాలు చేసి, తమ విభాగాల వైపు వెళ్లిపోతున్నారు. అప్పుడు సమయం సరిగ్గా ఉదయం 9.27గంటలు. ఒక్కసారిగా విస్ఫోటనం. ఏం జరిగిందో తెలిసేలోపే మరో భారీ పేలుడు. ప్రొడక్షన్ యూనిట్, దానిపై ఉన్న అంతస్తులు కుప్పకూలిపోయాయి. దట్టమైన పొగ, చుట్టూ శిథిలాలు.

సిగాచీ పరిశ్రమలోని ఇతర విభాగాల్లో ఉన్న కార్మికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని, ఎగిసి పడుతున్న అగ్నికీలలకు దూరంగా తోచిన వైపు పరుగెత్తారు. చుట్టుపక్కల పరిశ్రమల్లోనూ గందరగోళం. భూకంపం వచ్చిందేమోనని అంతా బయటకు పరుగులుదీశారు.నిమిషాల వ్యవధిలోనే ఈ వార్త అందరికీ చేరిపోయింది. ప్రమాదం జరిగిన కాసేపటికే కొన్ని వీడియోలు, ఫొటోలు వాట్సాప్ గ్రూపులలో షేర్ అయ్యాయి.

“అన్నా.. మీకు కొన్ని వీడియోలు పెట్టాను. పాశమైలారంలో భారీ ప్రమాదం జరిగిందంట. పూర్తి వివరాలు నాకు కూడా తెలియవు. కానీ లోపల చాలా మందే ఉన్నారని సమాచారం. త్వరగా వెళ్లు”అంటూ సునీల్ అనే మిత్రుడు నాకు కాల్ చేశారు. ఫోన్ పెట్టేసి, వెంటనే వాట్సాప్ ఓపెన్ చేసి చూస్తే... ఏదో పెద్ద ప్రమాదమే జరిగినట్లు స్పష్టంగా తెలిసింది. ఆలస్యంగా మిత్రుడు యోగానందరెడ్డితో కలిసి పాశమైలారం బయలుదేరాను.



సిగాచీ పరిశ్రమ వద్దకు చేరుకునే సరికి 20 నిమిషాలు పట్టింది. అప్పటికే పోలీసులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. పరిశ్రమకు వంద మీటర్ల దూరంలోనే అందరినీ ఆపేస్తున్నారు. వాళ్ల వద్దకు వెళ్లి అడిగితే, సహాయక చర్యలకు అడ్డంకిగా మారుతుందనే ఉద్దేశంతోనే ఇలా చేశామని చెప్పారు. చివరకు రిపోర్టర్లను ఇంకాస్త ముందు వరకు వెళ్లేందుకు అనుమతించారు. నడుచుకుంటూ కంపెనీ వైపు వెళుతున్నాం. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, హైడ్రా వాహనాలు, ఫైరింజన్లు, అంబులెన్సులు, పోలీసుల వాహనాలు.. ఆ ప్రాంతమంతా తీవ్రమైన రొద. అప్పుడు గమనించాను నేనొక విషయం. పేలుడు జరిగిన ప్రాంతానికి కొంత దూరంలో ఉన్న చెట్టుపై రేకులు వేలాడుతూ కనిపించాయి. సిగాచీ కంపెనీలో పొగ, భారీస్థాయిలో స్థాయిలో శిథిలాలు. ఘాటైన వాసనలు.

కంపెనీలో పనిచేస్తున్న వారి కుటుంబసభ్యులు, బంధువులకు విషయం తెలియడంతో సమీపంలో ఉన్న వారు పరుగుపరుగున వస్తున్నారు. తమవాళ్లకు ఏం కాకూడదనే దేవుళ్లకు మొక్కుతూ, ఏడ్చుకుంటూ వాళ్లు రావడం కనిపించింది. అప్పటికే జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్ సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు.

“గీ సప్పుడు ఇస్నాపూర్ దాంక ఇన్పించింది. ఏదో బాంబు పేలిందనుకున్నం. మా షాపు అద్దాలు కూడా అదిరినయి”అంటూ నా పక్కనే నిల్చున్న ఒకరు దోస్తుతో చెబుతున్నడు. ఒక్కసారి కాదు.. రెండు సార్లు పేలుడు సప్పుడు ఇనబడ్డది అంటూ వాళ్లు మాట్లాడుకుంటున్నరు. ఎవరికీ ఏం అర్థం కావడం లేదు. కానీ అందరి ముఖాల్లో ఒకటే భయం. చాలా మందే ప్రాణాలు కోల్పోయి ఉంటారనే ఆందోళన మాత్రం కనిపించింది. అట్లా సమయం గడుస్తున్నది. కానీ లోపల ఎంతమంది ఉన్నరు? వాళ్ల పరిస్థితి ఏందనే సంగతి ఎవరూ చెప్పడం లేదు. మంత్రులు దామోదర్ రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి ఘటనాస్థలికి చేరుకున్నారు. పరిశ్రమ లోపలికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు.

“అయ్యో ఎంత ఘోరం జరిగిపోయింది. ఎంత మంది ఉన్నారో లోపల? వారి పరిస్థితి ఏంటో? కనీసం దెబ్బలు తాకి, ప్రాణాలతో బయటపడ్డా మంచిదే”నంటూ అంటున్న వాళ్లే...అంతలోనే “గంత  పెద్ద పేలుడు. బిల్డింగ్ మొత్తం కూలిపాయె. లోపలున్నోళ్లు బతకుడు కష్టమే”నని బాధపడుతున్నరు.

ఇంతలోనే ఒక అంబులెన్స్ సిగాచీ గేటు దాటి బయటకు వస్తోంది. ఫొటోలు తీసుకోవడానికి ఫొటోగ్రాఫర్ల అంతా అంబులెన్స్ వైపు వచ్చారు. నేను కూడా ఫొటో తీద్దామని అటు వైపు ఉరికిన. దగ్గరికి వెళ్లి ఫొటో తీసే ప్రయత్నం చేశాను. ఒక్కసారిగా ఒళ్లు జలదరించింది. అటువైపు చూడలేకపోయా. చాలా భయమేసింది.

ఆ మృతదేహంపై కాళ్ల నుంచి మెడ వరకు దుప్పటి కప్పి ఉంది. ఆపైన కేవలం పుర్రె మాత్రమే ఉంది. ఆ పుర్రె నుంచి ఇంకా పొగలు వస్తున్నాయి. ఆ భయానక దృశ్యం ఇంకా నా కళ్లలో మెదులుతోంది. ప్రాణనష్టం భారీ స్థాయిలో ఉండబోతోందనే సంగతి అప్పుడే నాకర్థమైంది. ఆ తర్వాత చాలా మంది కార్మికుల శరీరాలను దాదాపుగా ఇదే స్థితిలో అంబులెన్సుల్లో తరలించారు.

సిగాచీ పరిశ్రమకు పక్కనే ఉన్న ఒక కాలువ వద్ద ఒక మహిళ తలనిండా కొంగుకప్పుకొని కూర్చుంది. కంపెనీలో పనికి వెళ్లిన తన భర్తకు ఫోన్ల మీద ఫోన్లు చేస్తోంది. కానీ అటువైపు నుంచి ఎలాంటి స్పందన లేదు. ఫోన్ రింగవుతోంది. కానీ ఎవరూ లిఫ్ట్ చేయడం లేదు. ఎవరితోనూ మాట్లాడకుండా, గట్టి గట్టిగా ఏడుస్తూ, చాలా సమయం ఆమె అలా ప్రయత్నిస్తూనే ఉంది. కాసేపటికే మాజీ మంత్రి హరీశ్ రావు అక్కడికి చేరుకున్నారు. కాలువ పక్కన కూర్చున్న మహిళతో మాట్లాడే ప్రయత్నం చేశారు. కానీ ఆమె ఏమీ మాట్లాడలేని స్థితిలో ఉండిపోయింది. తన భర్తకు ఏదో ప్రమాదం జరిగే ఉంటుందని గ్రహించి, గుండెలవిసేలా రోదిస్తూ అక్కడే కూర్చుండిపోయింది.

మంత్రులు దామోదర్ రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి విలేకరులతో మాట్లాడారు. “ప్రమాద స్థలిలో 65 మంది కార్మికులున్నారు. వారిలో 12 మంది అక్కడే దుర్మరణం పాలయ్యారు. మిగతా వారికి ఆస్పత్రుల్లో చేర్పించాం. చికిత్స అందిస్తున్నాం. కార్మికుల కుటుంబాలకు అండగా నిలిచే బాధ్యత మాది’ అంటూ ప్రకటించారు.

కార్మికుల కుటుంబీకులు, బంధువులు ప్రమాద స్థలి నుంచి ఆస్పత్రుల వైపు పరుగులుదీశారు. తమ వాళ్లు ఎలా ఉన్నారో తెలుసుకోవాలనే ఆందోళనతో అధికారులను వివరాలు అడుగుతూ కనిపించారు. కానీ అంతా గందరగోళం. ఎవరి శరీరం ఎవరిదో కూడా గుర్తుపట్టలేని భయంకరమైన పరిస్థితి.

“ప్రమాదం జరిగి గంటల సమయం గడిచినా కనీసం కాల్ సెంటర్ ఏర్పాటు చేయలేదు. సహాయ చర్యలు వేగంగా చేయడంలోనూ ప్రభుత్వం విఫలమైంది. మృతుల కుటుంబాలకు రూ.కోటి, క్షతగాత్రులకు రూ.50లక్షలు ఇవ్వాల”ని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ప్రమాద సమయంలో కంపెనీలో ఎందరు డ్యూటీలో ఉన్నారనే విషయం కూడా గుర్తించకపోవడమేంటి అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

“ఇప్పటి వరకు 16 మంది చనిపోయారు ”అంటూ ప్రమాదం జరిగిన రోజు రాత్రి వరకు అధికారికంగా ప్రకటించారు. కానీ చనిపోయిన వారి వివరాలు మాత్రం చెప్పలేకపోయారు. మృతదేహాలు గుర్తుపట్టలేనంతంగా  కాలిపోవడమే ఇందుకు కారణం. కార్మికులు, ఉద్యోగుల కుటుంబాల్లో ఈ వార్త మరింత ఆవేదనను మిగిల్చింది. తమవాళ్లు ఎలా ఉన్నారో తెలియక, వాళ్లంతా గుండెలవిసేలా రోదిస్తూనే ఉన్నారు. ఈ రోజుకు ఇంతకుమించి ఇంకేం సమాచారం ఇవ్వలేమన్నట్లు అధికారులూ నిస్సహాయతను వ్యక్తం చేశారు.

“ప్రాణనష్టం తక్కువగా ఉంటే బాగుండు. ఆస్పత్రుల్లో ఉన్న వారయినా బతికి బయటపడాలి” అనుకుంటూ, జరిగిన ఈ మహాదారుణానికి సంబంధించిన వార్తలు రాసేందుకు నేను సిగాచీ పరిశ్రమ వద్ద నుంచి సంగారెడ్డికి బయలుదేరాను.




# మీనాక్షి నటరాజన్ భేటీపై....

# అనవసర రాజకీయ అర్థాలు తియ్యొద్దు!

- **ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లవుతున్న సందర్భంగా.. పార్టీని బలోపేతం చేయాలనే అంశమై చర్చించాం**
- **గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నాయకులు, కార్యకర్తలు ఒక టీంగా సమన్వయంతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని సూచించాను**
- **రాబోయే 6 నెలల నుంచి ఏడాది కాలం అత్యంత కీలకమని వివరించాను**
- **ఎవరిపైనా వ్యక్తిగతంగా ఫిర్యాదు చేయలేదు.. ఎవరి పేర్లూ ఇన్ఛార్జి వద్ద ప్రస్తావించలేదు**
- **మీనాక్షి నటరాజన్ తో భేటిపై క్లారిటీ ఇచ్చిన జగ్గారెడ్డి**

**కందిలి, సంగారెడ్డి**

"ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లవుతున్న సందర్భంగా పార్టీని మరింత బలోపేతం చేయాలనే అంశమై చర్చించాను. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎవరైనా పార్టీ వ్యవస్థలో మిస్ అయ్యుంటే వారిని గుర్తించాలని కోరాను. చాలామందికి పదవులు వచ్చినప్పటికీ కొందరు కార్యకర్తలు, నాయకులు ఇంకా గుర్తింపు కోసం ఎదురుచూస్తున్నారని చెప్పాను. కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు, ఇతర నామినేటెడ్ పోస్టులు ఇచ్చిన తర్వాత కూడా కొందరు పార్టీ కార్యకర్తలు వ్యవస్థకు దూరంగా ఉన్నారని ప్రస్తావించాను. నేను వ్యక్తులపై ఫిర్యాదులు చేసే అలవాటు లేని వ్యక్తిని"అంటూ జగ్గారెడ్డి అన్నారు. శనివారం ఏఐసీసీ ఇన్ఛార్జి మీనాక్షి నటరాజన్ తో జరిగిన భేటీపై జగ్గారెడ్డి ఈ మేరకు క్లారిటీ ఇచ్చారు.

**మీడియాతో జగ్గారెడ్డి మాటలు ఇలా!**

- దాదాపు 67 నెలల తర్వాత AICC తెలంగాణ వ్యవహారాల ఇన్ఛార్జి మీనాక్షి నటరాజన్‌ను కలిశాను. నేనే స్వయంగా ఫోన్ చేసి అపాయింట్ మెంట్ కోరగా, ఆమె సమయం ఇచ్చారు. దాదాపు 10 నిమిషాల పాటు మాత్రమే భేటీ జరిగింది.
- ఈ సమావేశానికి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని స్పష్టం చేస్తున్నాను. మీడియాలో వస్తున్న ఊహాగానాలకు ఎలాంటి ఆధారం లేదు. ఏదైనా నిర్ణయం తీసుకోవడం కోసం లేదా ఫిర్యాదులు చేయడం కోసం నేను వెళ్లలేదు.
- పార్టీ సీనియర్ నాయకుడిగా ఆమెను మర్యాద పూర్వకంగా కలవాలనే ఉద్దేశంతో వెళ్లాను. గ్రామ స్థాయి నుంచి హైదరాబాద్ వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలందరినీ ఒక టీమ్‌గా సమన్వయం చేయాల్సిన అవసరం ఉందని సూచించాను.
- కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని చర్చించాం. సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేపడుతున్న కార్యక్రమాలకు అదనపు బలం చేకూర్చేలా పని చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశాను.
- రాబోయే 6 నెలల నుంచి ఏడాది కాలం పార్టీకి అత్యంత కీలకమని చెప్పాను. ఎన్నికల సంవత్సరం సమీపిస్తున్నందున ఇప్పటి నుంచే మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించాను. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎవరైనా పార్టీ వ్యవస్థలో మిస్ అయ్యుంటే వారిని గుర్తించి కలుపుకొని పోవాలని కోరాను.





- చాలామందికి పదవులు వచ్చినప్పటికీ కొందరు కార్యకర్తలు, నాయకులు ఇంకా గుర్తింపు కోసం ఎదురుచూస్తున్నారని చెప్పాను. కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు, ఇతర నామినేటెడ్ పోస్టులు ఇచ్చిన తర్వాత కూడా కొందరు పార్టీ కార్యకర్తలు వ్యవస్థకు దూరంగా ఉన్నారని ప్రస్తావించాను.
- నేను వ్యక్తులపై ఫిర్యాదులు చేసే అలవాటు లేని వ్యక్తిని. ఎవరిపైనా వ్యక్తిగతంగా ఫిర్యాదు చేయలేదు. ఎవరి పేర్లు కూడా ప్రస్తావించలేదు. ఆ అవసరం నాకు లేదు.
- ఇది పూర్తిగా సాధారణ పార్టీ వ్యవహారాలపై జరిగిన చర్చ మాత్రమే. కాంగ్రెస్‌లో విభేదాలు, చర్చలు, వాదోపవాదాలు సహజమని తెలిపాను. కాంగ్రెస్ పార్టీలో నాయకులు ప్రజల సమస్యలు, తమ వర్గాల ప్రాతినిధ్యం కోసం మాట్లాడతారని చెప్పాను.
- కాంగ్రెస్ పార్టీ సంస్కృతి చర్చలు, భిన్నాభిప్రాయాలకు అవకాశం ఇవ్వడమేనని వివరించాను. కాంగ్రెస్ పార్టీలో అభిప్రాయ భేదాలు ఉండటం అసాధారణం కాదని, వాటిని అతిగా అర్థం చేసుకోవద్దని మీడియాకు సూచించాను. నా భేటీపై అనవసర రాజకీయ అర్థాలు తీయవద్దు అని కోరుతున్నాను.



# జగ్గారెడ్డి చెప్పిన..రాజకీయ పాఠం!

- మొదటి సారి గెలుపును మరిచిపోవాలి
- రెండో సారి గెలిస్తేనే పెద్ద బ్రేక్
- అప్పుడు మాత్రమే రాజకీయంగా నిలబడగలుగుతాం
- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కు జగ్గారెడ్డి సూచన

**కందిలి, సంగారెడ్డి**

కాంగ్రెస్ పార్టీకి చెందిన యువ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు జగ్గారెడ్డి కీలక సూచనలు చేశారు. గాంధీభవన్ వేదికగా ఈ ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. తన తండ్రి మైనంపల్లి హనుమంతరావు, మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ తదితరులతో కలిసి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ గాంధీ భవన్ వద్ద జగ్గారెడ్డికి తారసపడ్డారు. ఈ సందర్భంగా వారి మధ్య మాటలు కలిసాయి. మైనంపల్లి రోహిత్ ను ఉద్దేశించి జగ్గారెడ్డి పలు సూచనలు చేశారు. “ఫస్ట్ టైం గెలుపును మర్చిపోండి. సెకండ్ టైం గెలిస్తేనే రాజకీయాల్లో నిలబడుతారు. సెకండ్ టైం ఎమ్మెల్యేగా పోటీని ఫస్ట్ టైం ఎన్నికగా భావించి కసితో పనిచేయాలి. రెండో సారి గెలిస్తే అదే పెద్ద బ్రేక్” అంటూ జగ్గారెడ్డి వివరించారు. ఈ మాటలను శ్రద్ధగా విన్న రోహిత్... ఒకసారి తమ ఇంటికి రావాలని జగ్గారెడ్డిని కోరారు.





# దేవుడి పేరు చెప్పి జలాశయం భూములు కబ్జా!

- సింగూరు ఏఫ్టీఎల్ పరిధిలో ఎకరాల కొద్దీ ఆక్రమించే పన్నాగం ఇది
- ఈ తతంగం వెనుక మంత్రి దామోదర్ రాజానర్సింహ బావమరిది ఉన్నారు
- చెరువు కట్టల విధ్వంసం, అక్రమ విద్యుత్ లైన్ల ఏర్పాటు, ఎఫ్టీఎల్ భూముల చదునుపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి
- అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ డిమాండ్

**కందిలి, అందోల్**

“ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ బావమరిది సింగూరు జలాశయం పరిధిలోని ఎఫ్టీఎల్ భూముల్లో ఆక్రమణలకు పాల్పడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆ భూములను చదును చేస్తున్నారు. మట్టితో నింపుతున్నారు. ఎలాంటి ఆలయ ఆనవాళ్లు లేని చోట, కొత్తగా గుడి నిర్మించేందుకు చూస్తున్నారు. దేవుడి పేరు చెప్పి అక్రమాలకు తెరతీసార”ని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆరోపించారు. శనివారం ఆయన స్థానిక బీఆర్ఎస్ నేతలు, రైతులతో కలిసి వట్టిపల్లి మండలం ఖాదీరాబాద్ శివారులో సింగూరు జలాశయాన్ని పరిశీలించారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ బావమరిదిపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు.

## మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ కామెంట్స్!

- సింగూర్ ప్రాజెక్ట్ రిపేర్ల కోసం నీటిని ఖాళీ చేసిన తరుణాన్ని ఆసరాగా చేసుకుని, వట్ పల్లి మండలం ఖాదీరాబాద్ శివారులోని ముంపు ప్రాంతం (FTL) పరిధిలో మంత్రి దామోదర రాజనర్సింహ బావమరిది అనిల్ రెడ్డి చేస్తున్న అక్రమ ఆక్రమణలు, చెరువు కట్టల ధ్వంసం, అక్రమ విద్యుత్ లైన్ల ఏర్పాటుపై తక్షణ విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నాం.
- అధికార బలంతో, ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తూ జరుగుతున్న భారీ భూఆక్రమణలు, దాని వల్ల జరుగుతున్న పర్యావరణ విధ్వంసంపై దృష్టి సారించాలని కలెక్టర్ ను కోరుతున్నాను.
- ఖాదిరాబాద్, సాయిపేట్ శివారులో "పొలం" పేరుతో ఇప్పటికే 70 ఎకరాల భూమి కలిగిన ఆయన, ఇప్పుడు టూరిజం రిసార్ట్, బోటింగ్ వ్యాపారం పేరిట అక్రమాలకు పాల్పడుతున్నారు.
- తమ వ్యాపార స్వార్థం కోసం అనిల్ రెడ్డి, ఆయన అనుచరులు ప్రాజెక్ట్ యొక్క Full Tank Level (FTL) పరిధిలోకి వచ్చే భూమిని భారీ యంత్రాలతో చదును చేశారు. అత్యున్నత న్యాయస్థానాల ఆదేశాల ప్రకారం పర్యావరణ పరిరక్షణ చట్టం కింద నీటి వనరులకు సంబంధించి ఎఫ్.టి.ఎల్ పరిధిలో ఎలాంటి ఆక్రమణలు లేదా భూస్వరూపాన్ని మార్చే పనులు చేయడం పూర్తిగా నిషేధం, శిక్షార్హమైన నేరం.
- ఇక్కడ మాత్రం ఫార్మ్ హౌస్ నుంచి లోపలికి సుమారు ఒక కిలోమీటర్ దూరం వరకు బండ రాళ్లతో నింపి, దానిపై మట్టితో అక్రమంగా రోడ్డు వేస్తున్నారు. ఈ క్రమంలో అక్కడ సహజసిద్ధంగా ఉన్న కొరివికుంట, నల్లకుంట చెరువుల కట్టలను పూర్తిగా తవ్వేశారు.
- విద్యుత్ శాఖ అనుమతి లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ముంపు ప్రాంతంలో కిలోమీటరు దూరం వరకు అక్రమంగా కరెంట్ లైన్లు లాగారు. ముంపు ప్రాంతంలో జీవనోపాధి కోసం మట్టి కొట్టుకునే స్థానిక పేద రైతులను మంత్రి అనుచరులు అడ్డుకుంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. తాము మాత్రం అడ్డుఅదుపు లేకుండా అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు.
- ప్రాజెక్టులో గుడి కడుతాం అనే నెపంతో అక్కడ జెండాలు పాతి, భవిష్యత్తులో ఈ కబ్జాను క్రమబద్ధీకరించుకునేందుకు కుట్రలు చేస్తున్నారు. ప్రాజెక్ట్ రిపేర్ కోసం నీటిని ఖాళీ చేస్తే, ఆ ఖాళీ స్థలాన్ని సొంత వ్యాపారానికి వాడుకోవడం అన్యాయం. అధికార పక్షానికి చెందిన వ్యక్తి కావడంతో స్థానిక అధికారులు కళ్ళున్నా కనపడనట్లు వ్యవహరిస్తున్నారు.
- కలెక్టర్ జోక్యం చేసుకోవాలని కోరుతున్నాం. తక్షణమే రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ శాఖాధికారులతో ఉమ్మడి విచారణ (Joint Inspection) జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను. అక్రమ నిర్మాణాలను కూల్చివేసి, విద్యుత్ లైన్లను తొలగించి, సింగూర్ ముంపు ప్రాంతాన్ని కాపాడటంతో పాటు బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.



# కేసీఆర్ ను కలిసి... ఎమ్మెల్యే చింత ప్రభాకర్!

సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ శనివారం ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు మాజీ సీడీసీ ఛైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి ఉన్నారు. కేసీఆర్ ను కలిసి వారు ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ను ఆప్యాయంగా పలకరించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న చింత ప్రభాకర్ ను అభినందించారు. రానున్న రోజుల్లో ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందని కేసీఆర్ ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

**కందిలి, సంగారెడ్డి**






# రూ.15.46 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు.. లబ్ధిదారులకు పంపిణీ!

- స్వయంగా అందించిన సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్
- ఈ సహాయ నిధి ద్వారా పేద, మధ్యతరగతి వారికి ఎంతో ఉపశమనం దక్కుతుందని వివరణ

**కందిలి, సంగారెడ్డి**

ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) ద్వారా మంజూరైన రూ.15.46 లక్షల విలువైన 59 చెక్కులను సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ స్వయంగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతోందని మాజీ సీడీసీ ఛైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి అన్నారు.

**చెక్కుల వివరాలు ఇలా ఉన్నాయి!**

- సంగారెడ్డి టౌన్ - 18 చెక్కులు, రూ.3,67,500
- సంగారెడ్డి మండలం - 3 చెక్కులు, రూ.97,000
- కొండాపూర్ మండలం - 18 చెక్కులు, రూ.4,04,000
- కంది మండలం - 12 చెక్కులు, రూ.3,96,000
- ఇతరులు - 8 చెక్కులు, రూ.2,81,500
- మొత్తం: 59 చెక్కులు, రూ.15,46,000

ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నరహరి రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ విజేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు చక్రపాణి, మధుసూదన్ రెడ్డి, విఠల్, కౌన్సిలర్లు నాగరాజ్ గౌడ్, నవీన్, శ్రీకాంత్, సర్పంచులు ఉమా సాయిగౌడ్, ఖాజా ఖాన్, ప్రభాకర్ రెడ్డి, శ్రవణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



Printed by SAKETH PUBLICATIONS, Published by Surkanti Rajender Reddy on behalf of Surkanti Rajender Reddy. Printed at Sangareddy and Published at H.No. 5-8-134/8, Plot No.75, Chanakyapuri Colony, Near St.Anthony School, Sangareddy, Telangana- 502001, Editor: Surkanti Rajender Reddy, RNI. NO. TGTEL/25/A 1800. Ph.7036545130. Emai id: Kandilinews@gmail.com